సాక్షి
వికారాబాద్
గురువారం । 10 । జూలై । 2025



విచ్చలవిడిగా గడ్డిమందు!

ప్రభుత్వం నిషేధించిన కలుపు నివారణ మందులను తెలిసీతెలియక కొంతమంది రైతులు విచ్చలవిడిగా వాడుతున్నారు. 8లో▸



బోనాల ఊరేగింపులో భక్తులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

బోనం..వైభవం

ధారూరు మండలం నాగసమందర్ గ్రామంలో బుధవారం పోచమ్మ తల్లికి బోనాల జాతర వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనమెత్తి ఆలయానికి చేరుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చెటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– ధారూరు



బోనమెత్తిన చిన్నారి

రేపు తాండూరు మున్సిపల్ కమిషనర్‌తో 'ఫోన్ ఇన్'

తాండూరు: మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో భాగంగా 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డితో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆయా వార్డుల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.





అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, తాగునీటి సరఫరా
మున్సిపాలిటీ : తాండూరు
కమిషనర్: విక్రమ్‌సింహారెడ్డి
తేదీ: 11-7-2025 (శుక్రవారం)
సమయం: ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్:
98499 05909

న్యూస్‌రీల్

మంత్రి కొండా సురేఖను కలిసిన నాయకులు



మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న డీడీఎస్ఎస్ నాయకులు

కొడంగల్ రూరల్: రాష్ట్ర ప్రజల సుభిక్షంగా ఉండాలని ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు చండీ, కుబేర, పాశుపత యాగాలు నిర్వహించనున్నట్లు డీడీఎస్ఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దౌల్తాబాద్ వాసుదేవశర్మ తెలిపారు. బుధవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో కలిసి యాగాలకు రావాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. అలాగే పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు జీ లక్ష్మీనరసయ్య శర్మ, జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, జ్యోషి కిట్టు స్వామి, దత్తాత్రేయరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు కొబ్బరి కాయల విక్రయానికి వేలం

మోమిన్‌పేట: మండలంలోని ఏన్కతల గ్రామంలో వెలసిన శనైశ్చరస్వామి ఆలయం వద్ద ఏడాది పాటు కొబ్బరి కాయలు విక్రయించడానికి ఈ నెల 11న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 10గంటలకు ఆలయం ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని ఆసక్తి గల వారు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

గురుకుల కళాశాల నుంచి విద్యార్థి అదృశ్యం

కుల్కచర్ల పీఎస్‌లో ఫిర్యాదు



సందీప్ (ఫైల్)

కుల్కచర్ల: గిరిజన గురుకుల కళాశాల నుంచి విద్యార్థి అదృశ్యమైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, అధ్యాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) చదువుతున్న సందీప్(16) మంగళవారం ఉదయం 7:35 నిమిషాలకు పాఠశాల ప్రహరీ దూకి పారిపోయాడు. అటెండెన్స్ సమయంలో విద్యార్థి గైర్హాజరును గమనించిన సిబ్బంది హాస్టల్‌లో వెతికారు. మధ్యాహ్నం వరకూ ఆచూకీ తెలియకపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఉదయం 7:35 నిమిషాలకు మరుగుదొడ్ల వద్ద ఉన్న ప్రహరీ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. కాలేజీ ప్రిన్సిపల్ మధుసూదన్, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. సందీప్ స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం రుసుంపల్లితో పాటు బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఉదయం కాలేజీ ప్రిన్సిపల్ కుల్కచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాసుల కోసం కవలల విచ్ఛిన్నం!

ఆరు నెలల గర్భిణికి అబార్షన్
- మగ కవలలను పొట్టన పెట్టుకున్న వైనం
- ప్రైవేటు ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన
- తమకు తెలియకుండా గర్భస్రావం ఎలా చేశారని వైద్యుల నిలదీత
- పరిగి పీఎస్‌లో ఫిర్యాదు



ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన

పరిగి: కాసులకు కక్కుర్తి పడి ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు ఆరు నెలల గర్భిణికి అబార్షన్ చేశారు. తమ అనుమతి లేకుండా గర్భస్రావం ఎలా చేస్తా రని సంబంధిత కుటుంబ సభ్యులు హాస్పిటల్ ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. ఈ ఘటన పరిగి మండలంలో చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. కళ్లాపూర్ తండాకు చెందిన హన్మంత్ నాయక్(24)కు గతేడాది చౌడాపూర్ మండలం, కొత్తపల్లి తండాకు చెందిన నందినితో వివాహం జరిగింది.నెల రోజుల క్రితం విద్యుత్‌షాక్‌కు గురైన హన్మంత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందాడు. అప్పటికే నందిని ఆరు నెలల గర్భిణి. హన్మంత్ అంత్యక్రియలు నిర్వహించిన మరుసటి రోజున ఇరు కుటుంబాలకు చెందిన వారు కూర్చుని మాట్లాడుకున్నారు. హన్మంతు ఇంటికి ఒక్కడే కొడుకు కావడంతో అతనికి వారసత్వం ఉండాలని, ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడ కూడదని నందినికి సూచించారు. ప్రసవం తర్వాత తమ ఆస్తులను పిల్లల పేరున చేయడంతో పాటు ఆతర్వాత నందిని ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆమెకు న్యాయం జరిగేలా చూస్తామని అత్తింటి వారు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గత సోమవారం నందిని అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి వెళ్లింది. ఆతర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ బుధవారం పరిగిలోని విజేత ఆస్పత్రిలో ఆమెకు అబార్షన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న హన్మంతు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని గర్భం నుంచి వెలికి తీసిన ఇద్దరు మృత మగ కవలలను చూసి గుండెలు బాదుకున్నారు. తమ అనుమతి లేకుండా అబార్షన్ ఎలా చేస్తారని వైద్యులను నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను, ఆస్పత్రి సిబ్బందిని స్టేషన్‌కు తరలించారు. హన్మంతు తల్లి మణెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజేత ఆస్పత్రిలో గతంలోనూ ఈ తరహా ఘటనలు జరిగాయి. ఇక్కడ అబార్షన్లతో పాటు ప్రసవాల కోసం వచ్చిన వారికి సిజేరియన్లు చేయడం నిత్యకృత్యమని పలువురు ఆరోపించారు. ఈ విషయమై పూర్తి స్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆస్పత్రి నిర్వాహకులను వివరణ కోరే ప్రయత్నం చేయగా.. సమాధానం చెప్పకుండా ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నం చేశారు.



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

ఆ చట్టాలను రద్దు చేయాల్సిందే

- కనీస వేతన సవరణ చట్టాన్ని అమలు చేయాలి
- దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొన్న కార్మికులు

తాండూరు టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న తీరుకు నిరసనగా పలు కార్మిక సంఘాలు బుధవారం పట్టణంలో సమ్మె నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో వేర్వేరుగా మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను, 29 కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. వీటి వల్ల కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల 12గంటల పాటు విధులు నిర్వర్తించాల్సి వస్తుందన్నారు. సామాజిక భద్రతా పథకాలను తగ్గిస్తూ, ఏకంగా కార్మిక సంఘాలను రద్దు చేయాలనే యోచనలో కేంద్రం ఉందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం కింద రూ.26 వేలు చెల్లించడంతో పాటు, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు, పీఎఫ్, బీమా సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిట్, కార్యదర్శి రవీందర్, నాయకులు గోపాల్, మునీర్, దస్తప్ప, మీనాజుద్దీన్, దేవి, అబ్దుల్లా, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, మల్కయ్య, కృష్ణ, బాలమణి, బేబి, భారతి, మల్లమ్మ, సుమలత, శాంత, అరుణ, శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

జుంటివాగు పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



వాగును పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

బషీరాబాద్: మండలంలోని జుంటివాగును బుధవారం ఇరిగేషన్ డీఈ కృష్ణయ్య, యాలాల తహసీల్దార్ వెంకటస్వామి ఆధ్వర్యంలో రెండు శాఖల అధికారులు పరిశీలించారు. ఈ నెల 8న కబ్జా చెరలో జుంటివాగు అనే శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో అధికారుల బృందం జుంటివాగును పరిశీలించింది. వాగు పొడవున 200 మీటర్ల మేర 5 మీటర్ల లోపలికి కబ్జా చేసినట్లు గుర్తించారు. పక్కనే ఉన్న పొలం యజమాని సంతోష్ కుమార్, వీణ దంపతులు చెక్‌డ్యామ్‌కు వింగ్ వాల్ కింద తాండూరు మండలం మాచనూరు రెవెన్యూ పరిధిలోకి వచ్చే సర్వే నంబర్ 39జీ 2లో 20 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని తెలిపారు. ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టినట్ల అధికారుల బృందం గుర్తించింది. అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేసి స్థలాన్ని ప్రభుత్వ స్వాధీనం చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతోనే వాగు రోజు రోజుకూ కబ్జాలకు గురై కుచించుక పోయిందని పలువురు రైతులు ఆరోపించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ భానుప్రకాశ్ రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి

- జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి
- ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



దుద్యాల్‌లోని ఫెర్టిలైజర్ దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

దుద్యాల్: మండలంలో సాగుకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి ఫెర్టిలైజర్ దుకాణ యజమానులకు సూచించారు. బుధవారం దుద్యాల్, పోలేపల్లి గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. హకీంపేట్ రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతి రైతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పంటల సాగుపై సందేహాలు ఉంటే ఏఈఓను సంప్రదించాలని అన్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు ఎక్కువగా వాడరాదని సూచించారు. మోతాదుకు మించి వాడితే పంట ఎదుగుదల, దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రస్తుత సీజన్‌కు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచాలని ఫెర్టిలైజర్ దుకాణ యజమానులకు సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈఓ భావన ఉన్నారు.



అనంతగిరి: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్



పరిగి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వాసుచంద్ర

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

- అదనపు కలెక్టర్ సుధీర్
- బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ

అనంతగిరి: బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, మార్పులు చేర్పులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. బుధవారం వికారాబాద్ మండలంలోని బీఎల్‌ఓలకు మున్సిపల్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారం 6, 7, 8 నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి, నూతన ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పేర్లలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లు నమోదు చేయాలని, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చూడాలన్నారు. మరణించిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జిల్లా మాస్టర్ ట్రైనర్, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ నంబరు అనుసంధానం చేయాలి

పరిగి: ఓటరు కార్డుకు ఆధార్ నంబరు అనుసంధానం చేయాలని వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర సూచించారు. బుధవారం పరిగి పట్టణంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎల్ఎంటీ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కా బతకాలి

- వన మహోత్సవాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- కలెక్టర్ ప్రతీక్‌జైన్



నవాబుపేట: చించల్‌పేటలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

నవాబుపేట: వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో నాటిన ప్రతి మొక్కా బతకాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మండలంలోని చించల్‌పేటలో మొక్కలు నాటారు. అక్నాపూర్, అత్తాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి పరిశీలించారు. కలెక్టర్‌కు స్వాగతం పలికేందుకు విద్యార్థులను లైన్‌లో నిలబెట్టటాన్ని గమనించిన ఆయన హెచ్ఎం పాండు, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాయని తెలిపారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరైన వారు పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో 9వేల ఇళ్లు గ్రౌండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాల కారణంగా ఇళ్ల నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యం అవుతున్నట్లు చెప్పారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో జిల్లా వ్యాప్తంగా 10వేల దరఖాస్తులు వచ్చాయని, ప్రతి వారం 500 అర్జీలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. భూ సమస్యలు ఉన్న వారు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కావడం లేదని, దీంతో పనులు ఆగిపోయాయని ఎమ్మెల్యే యాదయ్య కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన త్వరలో బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. బడి బయట పిల్లలు ఉండరాదన్నారు. అత్తాపూర్‌లో ప్రాథమిక పాఠశాల మూతపడిన విషయం తెలుసుకున్న కలెక్టర్ ఎందుకు పిల్లలను పాఠశాలకు పంపడం లేదని గ్రామస్తులను అడిగారు. పిల్లలు ప్రైవేటు స్కూళ్లకు వెళ్తున్నారని చెప్పడంతో పాఠశాల భవనాన్ని గ్రంథాలయానికి వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల ప్రత్యేకాధికారి మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బుచ్చయ్య, ఎంపీడీఓ అనురాధ, మండల నాయకులు నాగిరెడ్డి, ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, ఎక్బాల్, అనంతరామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈ సందర్భంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్ హాలి, సంబంధిత అధికారులు ఉన్నారు.

వసతులు కల్పించండి

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలల్లో మరమ్మతులపై దృష్టి సారించాలన్నారు. మౌలిక వసతులు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఐఓ శంకర్ నాయక్ తదితరలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహేందర్‌రెడ్డి మరణం తీరని లోటు

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బంట్వారం: బీజేపీ సీనియర్ నాయకుడు పట్లోల్ల మహేందర్‌రెడ్డి అకాల మరణం పార్టీకి తీరని లోటని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కోట్‌పల్లి మండలం బార్వాద్‌కు చెందిన మహేందర్‌రెడ్డి గత నెల 28న విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం గ్రామంలో నిర్వహించిన సంస్మరణ సభకు ఎంపీ హాజరై సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు మాధవరెడ్డి, వడ్ల నందు, శివరాజ్, నరేందర్‌రెడ్డి, శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, బార్వాద్ మాజీ సర్పంచ్ వెంకటేష్ యాదవ్, అడ్వకేట్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం

అనంతగిరి: బాలల హక్కులను కాపాడటం మన బాధ్యత అని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి సరిపడా భూములను గుర్తించాలన్నారు. ప్రతి బుధ, శుక్రవారాలు ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. చెంచు కుటుంబాలను గుర్తించి వారికి ఇంటి స్థలం 80 చదరపు గజాలు కేటాయించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలను చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలను పనుల్లో పెట్టుకోవడం నేరమన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ యాదయ్య, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీబ్ల్యూఓ కృష్ణవేణి, డీఈఓ రేణుకాదేవి, డీపీఓ జయసుధ, డీసీపీఓ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రలోనే మృత్యు ఒడికి

మొయినాబాద్: తలనొప్పిగా ఉందని టాబ్లెట్ వేసుకుని, కుర్చీలో కునుకు తీసిన ఓ వ్యక్తి నిద్రలోనే మరణించాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం వట్టినాగులపల్లికి చెందిన గోలియా శ్యామ్ సుందర్ సింగ్(55) నాగిరెడ్డిగూడ రెవెన్యూలోని సుజాత స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తలనొప్పిగా ఉందని టాబ్లెట్ వేసుకుని కుర్చీలో నిద్రపోయాడు. కొంతసేపటి తర్వాత తోటి ఉద్యోగులు నిద్రలేపే ప్రయత్నం చేయగా లేవలేదు. వెంటనే భాస్కర ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బసిరెడ్డిపల్లి వాసికి డాక్టరేట్ పట్టా



డాక్టరేట్ పట్టా తీసుకుంటున్న రామచంద్రయ్య

పరిగి: మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన రామచంద్రయ్య యాదవ్ డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో స్టాక్ మార్కెట్ ప్రవర్తన, భారత దేశ వృద్ధి అనే అంశంపై పరిశోధనలు చేశారు. ప్రొఫెసర్ నకుల రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన సాగించారు. స్టాక్ మార్కెట్ మార్గదర్శకాలు, ఆర్థిక వృద్ధిపై నివేదికను అందజేశారు. పరిశోధనలు పూర్తి కావడంతో బుధవారం డాక్టరేట్ పట్టా పొందారు.

కేసులు నమోదు చేయాలి



ఘటన స్థలాన్ని సందర్శించిన నాయకులు

అనంతగిరి: సర్పన్ పల్లి ప్రాజెక్ట్‌లో రిసార్ట్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఇద్దరు మహిళా పర్యాటకులు మృతి చెందిన ఘటనపై నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు వైగీత కోరారు. బుధవారం సర్పన్‌పల్లి ప్రాజెక్టు పరిసరాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రిసార్ట్‌లపై ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రిసార్ట్ క్లోజ్‌డ్ అని బోర్డు పెట్టినప్పటికీ, ఎవరు మూసివేశారన్న విషయమై స్పష్టత లేదన్నారు. అనంతగిరి చుట్టూ అనుమతి లేకుండా కొనసాగుతున్న రిసార్ట్‌లను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందురుపాటి గోపాల్ రెడ్డి, బి. మల్లేష్, మాదారం వెంకటేష్, పీర్ మహమ్మద్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

సాగు.. సాగదే!



దోబూచులాడుతున్న వరుణుడు

- ఇప్పటి వరకు కురవని భారీ వర్షం
- వర్షాలు లేక ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం
- జిల్లాలో5.63 లక్షల ఎకరాలలో పంటల సాగుకు అంచనా
- ఈ సీజన్‌లో జిల్లాలో 134.2ఎంఎంల నగటు వర్షపాతం నమోదు

తాండూరు: కర్షకులకు ఖరీఫ్ కష్టాలు మొదలయ్యాయి. పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత ఒక వైపు.. సరైన వర్షాలు కురవక పోవడం మరోవైపు రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. మే నెలలో దండిచికొట్టిన వానలు జూన్, జూలైలో ముఖం చాటేశాయి. తేలికపాటి వర్షాలకు కొంతమంది రైతులు ఆరుతడి పంటలు సాగు చేశారు. వీటికి అడపాదడపా వానలు కురుస్తున్నా సీజన్ ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి వరకు ఒక్క భారీ వర్షం కురవలేదు.

- జిల్లాలోని 20 మండలాల్లో 5.63 లక్షల ఎకరాల్లో ఈసారి పంటలు సాగయ్యే అవకాశం ఉంది.
- ఇప్పటికే సగం మంది పత్తి, కంది, మొక్కజొన్న వరి సాగు చేశారు. మిగిలిన వారు వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు.
- ప్రస్తుత సీజన్‌లో 2.58 లక్షల ఎకరాల్లో పత్తి, 1.14 లక్షల ఎకరాల్లో కంది వేశారు.

ఎనిమిది మండలాల్లో వర్షాభావం..

- మోమిన్‌పేట్, వికారాబాద్, మర్పల్లి, బంట్వారం, నవాబుపేట్, కులకచర్ల, తాండూరు, బషీరాబద్ మండలాల్లో 30 మి.మీ.ల నుంచి 45 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ ధ్రువీకరించింది.
- నైరుతి రుతు పవనాలు కారణంగా గత నెల జూన్ 10, 12, 13, 30వ తేదీల్లో వర్షాలు కురిశాయి.
- దీంతో నెల రోజుల్లో 72 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.
- జూలై 1నుంచి 3వ తేదీ వరకు కురిసిన వర్షాలతో 40 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.
- వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం ఇది సాధారణం కన్నా తక్కువే.
- మరో వారం రోజులు వర్షాభావ పరిస్థితులు సంభవిస్తే రైతులు పొలాల్లో వేసుకొన్న పంటలు పూర్తిగా ఎండిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లా వ్యాప్తంగా ఈరోజు వరకు 146.4 మిల్లీలీటర్ల వర్షపాతానికి గాను 134.2 మిల్లీమీటర్లు నమోదైంది.
- తేలికపాటి భూముల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతే విత్తనాలు వేసుకునే అవకాశం ఉంది.
- నల్లరేగడి నేలల్లో 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతే విత్తుకోవాలి.
- పెసర, మినుము తదితర స్వల్పకాలిక పంటలు 70శాతానికి పైగా సాగయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

పరిహారం ఇప్పించండి సారూ

- సబ్‌కలెక్టర్‌ను కోరిన కోటబాసుపల్లి గ్రామస్తులు
- జాతీయ రహదారి నిర్మాణంతో ఇళ్లు కోల్పోతున్నామని ఆవేదన



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోటబాసుపల్లి గ్రామస్తులు

తాండూరు రూరల్: జాతీయ రహదారి నిర్మాణంతో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు కోల్పోతున్నామని, బాధితులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని గ్రామస్తులు కోరారు. బుధవారం తాండూరు మండలం కోటబాసుపల్లి గ్రామస్తులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..తాండూరు–చించోళి ప్రధాన రోడ్డు మార్గంలో ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారిని నిర్మిస్తున్నారన్నారు. ఈ నిర్మాణంలో కోటబాసుపల్లి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న 27ఇళ్లు కొన్ని పూర్తిగా, మరికొన్ని పాక్షికంగా దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. రోడ్డువెడల్పులో ఇళ్లుపోతే ఎక్కడ నివసించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పరిహారం ఇస్తే మరోచోట ఇళ్లు నిర్మించుకుంటామన్నారు. కావున ప్రభుత్వం పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని సబ్ కలెక్టర్‌ను వారు కోరారు. ఈ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ మొగులప్ప, మాజీ సర్పంచు కుర్వ నాగార్జున, గ్రామస్తులు రఘునాథ్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

- పోలీసులకు ఫిర్యాదు

తాండూరు టౌన్: సోషల్ మీడియాలో తమ వర్గాన్ని అవమానిస్తూ పోస్టు పెట్టాడని ఆరోపిస్తూ పలువురు వ్యక్తులు ఓ యువకుడిపై దాడి చేసిన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణ సీఐ సంతోశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..తాండూరు మండలం అంతారం గ్రామానికి చెందిన వడ్డే రవి సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టాడు. ఈ విషయం గురించి గ్రామానికి చెందిన పలువురు తనపై దాడికి పాల్పడ్డారని, బలవంతంగా అంబేడ్కర్ విగ్రహం కాళ్లు మొక్కించి, క్షమాపణలు చెప్పించారని పేర్కొన్నారు. తనపై దాడిచేసిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా బాధితున్ని అకారణంగా టార్గెట్ చేసి దాడికి పాల్పడ్డారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పోలీసులను కోరారు.



మందు పిచికారీ చేసిన కొద్ది గంటల్లోనే ఎడ్డిపోతున్న గడ్డి

విచ్చలవిడిగా గడ్డిమందు!

- జిల్లాలో జోరుగా నిషేధిత కలుపు మందుల వినియోగం
- కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్న వైనం
- దీర్ఘకాలిక దుష్ప్రభావాలు తప్పవంటున్న పర్యావరణవేత్తలు

దుద్యాల్: ప్రభుత్వం నిషేధించిన కలుపు నివారణ మందులను తెలిసీతెలియక కొంతమంది రైతులు విచ్చలవిడిగా వాడుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటక నుంచి వీటిని దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా సైతం విక్రయిస్తుండటంతో పత్తి, మొక్కజొన్న, వరి, కంది తదితర పంటలు సాగు చేసిన రైతులు గడ్డిని నియంత్రించేందుకు విరివిగా నిషేధిత మందును వినియోగిస్తున్నారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాలకు కర్ణాటక రాష్ట్రం సరిహద్దుగా ఉండటంతో అలవోకగా తెచ్చుకుంటున్నారు. మన జిల్లాలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల్, యాలాల, బషీరాబాద్, తాండూరుతోపాటు నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి, దామరగిద్ద, ఉట్కూర్, నారాయణపేట తదితర మండలాలు కర్ణాటకతో సరిహద్దును కలిగి ఉన్నాయి. గరిష్టంగా 40 కిలోమీటర్లలోపు దూరం ఉండటంతో ఇలా వెళ్లి అలా తెచ్చేస్తున్నారు. కొంత మంది దళారులు వీటిని రైతులకు తీసుకువచ్చి ఇస్తున్నారు. స్ప్రే చేసిన కొద్ది గంటల్లోనే గడ్డి పూర్తిగా మాడిపోతుండటంతో రైతులు వీటిని ఎక్కువగా వాడుతున్నారు.

గడ్డి మందుతో దుష్ఫలితాలు

- గడ్డి మందును పంటల్లో పిచికారీ చేయడం ద్వారా భూమి సహజత్వాన్ని కోల్పోతుంది.
- నేలలు నిస్సారవంతంగా మారి పంటలు ఎదగవు, దిగుబడులు పూర్తిగా పడిపోతాయి.
- మందు స్ప్రే చేసిన గడ్డిని మేస్తే పశువులు, గొర్రెలు, మేకలు చనిపోయే ప్రమాదం ఉంది.
- గడ్డిమందు పిచికారీ చేసే రైతులు శ్వాసకోస వ్యాధులతో పాటు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఎక్కువ.

తెలంగాణకే ఆదర్శం ఎన్నేపల్లి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: ఎన్నేపల్లి యావత్ తెలంగాణకే ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎన్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల విద్యాప్రగతి పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. శ్రీబలభీమ న్యూస్ ఛానెల్, మాస్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ముఖ్య అతిథులు, మాట్లాడారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్ర యాదవ్, సీఐ శ్రీధర్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, నర్సింలుగౌడ్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడారు. గ్రామం నుంచి ప్రైవేట్ బడులకు వెళ్లేవారు ఇక్కడ చేరడం, గురుకులాలకు ఎక్కువ మొత్తంలో ప్రవేశాలు సాధించడం, మహిళా సంఘాల చొరవ, ప్రభుత్వ బడులను కాపాడుకొంటూ విద్యాప్రగతి సాధించడంలో మండలంలోనే ప్రథమ స్థాయిలో నిలిచిందని వారు ప్రశంసించారు. విద్యార్థులకు కుటుంబ సభ్యులు సైతం జ్ఞానం అందివ్వాలని, విద్యా పర్యవేక్షణ చేయాలని ప్రధాన వక్త భాస్కరయోగి పేర్కొన్నారు.

పలకల పంపిణీ

పాఠశాలలోని నూతన 120మంది విద్యార్థులకు దాతల సహకారంతో ఉచితంగా పలకలు, ఐడీ కార్డులు, టై, బెల్టు, బూట్లు, బ్యాగులు, పాఠశాలకు సీసీకెమెరాలు, ఫరేడ్ డ్రమ్స్ అందజేశారు.

మొక్కలు నాటిన అధికారులు

కొడంగల్ ఫారెస్టు రేంజ్ అధికారి సవిత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వనమహోత్సవం నిర్వహించారు. అడవులను కాపాడాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం మహిళా సంఘాల ప్రతినిధులకు, తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందజేశారు. పూర్వ ఉపాధ్యాయులు రహీం, అలీమ్, హెచ్ఎం జ్యోతిపరమేశ్వరి దంపతులకు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో టీవీవీ జిల్లా కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఎంఈఓలు హరిలాల్, రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సేవలు అభినందనీయం

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేకమైన వాహనాన్ని ఏర్పాటుచేసి శుభ్రం చేయిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సేవలు అభినందనీయమని వైజీఆర్ స్వచ్ఛంద సంస్థ మండల కో ఆర్డినేటర్ రాంచంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం ఘణపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీరోజు పార్లమెంటరీ నియోజకవర్గంలోని 36 పాఠశాలలను శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ఏర్పాటుచేసిన వాహనం ద్వారా స్వచ్ఛత కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఘణపూర్ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛత కార్యక్రమంలో నాయకులు

చైన్ స్నాచర్ల అరెస్ట్, రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

నవాబుపేట: ఇద్దరు చైన్ స్నాచింగ్ దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం నవాబుపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని ఎత్‌రాజ్ పల్లి గ్రామానికి చెందిన మీనపల్లి సత్యమ్మ వారం క్రితం పొలం నుంచి మధ్యాహ్న సమయంలో ఇంటికి వస్తుంది. అదే సమయంలో రాజస్థాన్‌కు చెందిన సేవారాం, దీపారాంలు లూనాపై ఆమె దగ్గరికి వచ్చి ఈ రోడ్డుఎక్కడికి పోతుందని మాటలు కలిపి మెడలోని (40 గుండ్లగల) బంగారాన్ని అపహరించారు. ఈ విషయాన్ని బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. వారు సదశివాపేట వద్ద ఉన్నారనే పక్కా సమాచారంతో అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. తామే బంగారు గొలుసును అపహరించినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

స్త్రీనిధి జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ

కొడంగల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్త్రీనిధి జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ, ఆర్గనైజర్ రాజేశ్వరీ అన్నారు. ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాల్లో భాగంగా బుధవారం పట్టణంలో వెటర్నరీ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘాల్లో లేని మహిళలను గుర్తించి వారిని కొత్త సంఘాల్లో చేర్పించాలన్నారు. ఆగిపోయిన సంఘాలను గుర్తించి వాటిని పునరుద్ధరించాలన్నారు. మహిళా వృద్ధాప్య సంఘాలను, కిషోర బాలికలసంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం వల్ల వారు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందన్నారు. జీవిత బీమా, ప్రమాద బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో మహిళలను స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో కొడంగల్ మున్సిపల్ మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

పూడూరు: మహిళా సమాఖ్య సంఘాల ద్వారా రుణాలు తీసుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ నర్సింలు అన్నారు. బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మండలంలోని మేడిపల్లికలాన్, పరిగి మండలం రూఫ్‌ఖాన్‌పేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ మాట్లాడుతూ.. మహిళలు సంఘటితంగా ఉండి ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెట్రోల్ బంక్ లు, ప్రైవేటు బస్సుల కొనుగోలు, క్యాంటిన్ల వంటివి ఏర్పాటు చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు బందయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సీసీలు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- కార్మిక సంఘాల డిమాండ్
- భారీ ర్యాలీలు, నిరసనలు



వికారాబాద్‌లో భారీ ర్యాలీ



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతగిరి: పెట్టుబడుదారుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పలువురు కార్మిక సంఘాల ముఖ్య నాయకులు, డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, రైతు, ప్రజ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీ చౌరస్తా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమావేశం ఏర్పాటు చేసి పలువురు నాయకులు మాట్లాడుతూ 12గంటల పని విధానాన్ని రద్దు చేసి 8గంటలు అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి పారిశ్రామిక సంబంధాల కోడ్, ట్రేడ్ యూనియన్లో ఉద్యోగుల కార్మిక సంఘటిత శక్తిని బలహీన పరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌ల ప్రకారం యాజమాన్యాలు సర్వీస్ కండిషన్లు మార్చాలనుకుంటే ముందస్తు నోటీస్ ద్వారా తెలియజేయవలసిన అవసరం ఉండదని, పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలయితే 300 మంది లోపు కార్మికులను ప్రభుత్వ అనుమతి లేకుండా యథేచ్ఛగా కార్మికుల్ని తొలగించుకోవచ్చనే నిబంధనలు తీసుకొచ్చారన్నారు. సామాజిక భద్రత కోడ్ అమలు వల్ల ఉద్యోగులు పొందే ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ 12 నుంచి 10 శాతం తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై గీత, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, టీఎస్‌టీఎఫ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అనసూయ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ రద్దు కోసం నిరసన

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, 29కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు అరుణ జ్యోతి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల రక్షణకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహించినట్లు వారు తెలిపారు. కనీసవేతనం రూ. 26వేలు అందించాలని, కార్మిక వర్గానికి ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటయ్య, పకీరప్ప, చంద్రకళ, కుర్మాని సాయిలు, దప్పు రాములు, రాములు, మంజుల పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్
- జిల్లా కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏ వారసులు

అనంతగిరి: జీవో నెంబర్ 81, 85 ప్రకారం వీఆర్‌ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు పూజారి శ్రీకాంత్ తెలిపారు. బుధవారం వీఆర్‌ఏ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు పిలుపుమేరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, కలెక్టర్ ప్రతిక్ జైన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020, సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్‌ఏలకు పే స్కేల్, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిందన్నారు. వివిధ శాఖల్లో 16,758 మందిని ఆయా శాఖల్లో సర్దుబాటు చేయగా, మిగిలిన 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా రెండు సంవత్సరాలుగా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకున్నా నేటికి మండల రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్నారని, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేపట్టే గ్రామ పరిపాలన అధికారి నియామకాల్లో వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇచ్చి వీఆర్‌ఏల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి ప్రజా సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ జేఏసీ ధారూరు మండల అధ్యక్షుడు సంగమేష్, మర్పల్లి అధ్యక్షుడు సంగమేశ్వర్, వికారాబాద్ మండల అధ్యక్షుడు బండకింది శ్రీనివాస్, యాలాల మండల అధ్యక్షుడు నర్సింహులు, పెద్దేముల్ మండల అధ్యక్షుడు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.